సాక్షి
ఖమ్మం
బుధవారం ǀ 24 ǀ సెప్టెంబర్ ǀ 2025



ఆగలేదు.. ఆపారంతే!

ఏపీ నుంచి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు ఇసుక అక్రమ రవాణా రెండు రోజులు ఆగగా.. మళ్లీ యథావిధిగా మొదలైంది. 8లో



దొంగల హల్‌చల్

ఖమ్మం ఎనిమిదో డివిజన్ వైఎస్సార్ నగర్‌లోని పలువురి ఇళ్లలో ఒకే రోజు చోరీ జరగడం కలకలం సృష్టించింది. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



అమ్మ వారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌కు ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించగా, ఆతర్వాత యాగశాలలో శ్రీవారు, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం అలివేలు మంగ అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవి అవతారంలో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ముఖ్య అర్చకుడు మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

కౌన్సిలర్ల నియామక దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రాల్లో తరగతులు బోధించడానికి కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలోని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బి.వీరన్న తెలిపారు. సంబంధిత పీజీలో 55శాతం మార్కులతో పాటు బోధన అనుభవం, పీహెచ్‌డీ నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు www. braou online. in వెబ్‌సైట్‌లో అక్టోబర్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

చింతకాని: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా ఉందని, ఎక్కడైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండలానికి కోటా మేరకు సరఫరా చేస్తున్నందున రైతులకు పంపిణీ చేయాలని, రోజువారీ స్టాక్ వివరాలు వెల్లడించాలని తెలిపారు. ఈక్రమంలో రైతులకు బిల్లులు ఇవ్వకున్నా, ధరలు పెంచినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు కూడా అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నందున ఆందోళనకు గురికావొద్దని డీఏఓ సూచించారు. ఏఓ మానస, ఏఈఓలు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ తరహాలో బౌద్ధక్షేత్రం అభివృద్ధి



బౌద్ధక్షేత్రం వద్ద సమీక్షిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా అతి పెద్దదైన మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్.రమేష్ తెలిపారు. ఆయన మంగళవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి బౌద్ధక్షేత్రం, ఆనుకుని ఉన్న చెరువును పరిశీలించి పర్యాటకంగా చేయాల్సిన పనులపై చర్చించారు. ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ మాదిరి బోటింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్, పార్క్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ఆరాతీశారు. ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, జేఈలు మదీనా, రుత్విక్‌తో పాటు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల అనుమతికి దరఖాస్తులు

ఖమ్మంక్రైం: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసే వ్యాపారులు ఏసీపీ కార్యాలయాల్లో అక్టోబర్ 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీపీ సునీల్‌దత్ సూచించారు. మున్సిపల్, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశాల్లోనే షాప్‌ల ఏర్పాటుకు అనుమతిస్తామని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఇతర పత్రాలు, చలానా రశీదు, ఆధార్ కార్డ్, ఫొటో జతపరిచి అందజేయాలని సూచించారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారుచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

మిగిలింది సమరమే..



పరిషత్, పంచాయతీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు

- జీసీ రిజర్వేషన్ల జీఓ రాగానే ప్రకటన
- ఎన్నికల నోటిఫికేషన్‌పై ఆశావహుల్లో ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గ్రామపంచాయతీల వార్డుసభ్యులు, సర్పంచ్‌లే కాక ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ ముగిసింది. మండలాల వారీగా స్థానాలు ఖరారు కాగా.. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేశాక అన్ని స్థానాల రిజర్వేషన్లను ప్రకటిస్తారు. జిల్లాలో 571 గ్రామపంచాయతీలు, 283 ఎంపీటీసీలు, 20 జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు కావడంతో.. ఏ స్థానం ఏ కేటగిరీకి రిజర్వ్ అయిందన్న ఉత్కంఠ నెలకొంది. మరోపక్క ఓటర్ల జాబితా సైతం సిద్ధంగా ఉండడంతో ఎన్నికల షెడ్యూల్ విడుదలే మిగిలింది.

ఒక్కో స్థానం పరిశీలించి..

రిజర్వేషన్ల నిర్ధారణ సందర్భంగా గతంలో ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఏం చేయాలనే అంశాన్ని అధికారులు నిశితంగా పరిశీలించారు. గ్రామాల వివరాలను గ్రామకార్యదర్శుల నుంచి సేకరించి ఆ ప్రకారం వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను ఎంపీడీఓలు, ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లను ఆర్డీఓలు చేపట్టారు. ఇక జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లను కలెక్టర్ పూర్తిచేశారు. అలాగే జెడ్పీ చైర్మన్ / చైర్‌పర్సన్ రిజర్వేషన్‌ను పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఖరారు చేస్తారు. 2011జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు, 2024 తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

జీఓ వెలువడ్డాకే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవడంతో అధికారులు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. కానీ రిజర్వేషన్ల వివరాలను బయటకు ప్రకటించలేదు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై జీఓ విడుదల చేశాకే వార్డులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ / చైర్‌పర్సన్ రిజర్వేషన్లను అధికారికంగా వెల్లడిస్తారు.

ఏం చేద్దాం?

జిల్లాలో ఎక్కడ చూసినా స్థానిక సంస్థల స్థానాల రిజర్వేషన్లపై చర్చ జరుగుతోంది. గతంలోనే ఓటరు జబితా సిద్ధమవడం, ఇప్పుడు రిజర్వేషన్లు కూడా ఖరారవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. స్థానాల వారీగా గతంలో ఎవరికి రిజర్వు అయ్యాయి, ఈసారి ఏ కేటగిరీకి రిజర్వ్ అయ్యే అవకాశముందని బేరీజు వేసుకుంటున్నారు. తాము పోటీ చేయాలనకునే స్థానం ఏ కేటగిరీలోకి వెళ్తుందో ఓ అంచనాకు వస్తూ పోటీపై ఆలోచనల్లో మునిగితేలుతున్నారు.

నకిలీ పాస్‌పుస్తకాల కలకలం



వివిధ ప్రాంతాల రైతుల పేరిట రూపొందించిన నకిలీ పాస్‌పుస్తకాలు

- రాష్ట్రంలో వివిధ ప్రాంతాల రైతులకు టోకరా
- రెవెన్యూ మంత్రికి అందిన ఫిర్యాదుతో కదిలిన డొంక
- ఐదుగురితో కూడిన ముఠా అరెస్ట్

కూసుమంచి: సమస్యల్లో ఉన్న భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల మేర వసూలు చేసి నకిలీ పుస్తకాలు అంటగట్టిన ముఠా వ్యవహారం బట్టబయలైంది. జిల్లాలోని కూసుమంచి పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి 10 నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. వీరి చేతిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంతో పాటు రాష్ట్రంలోని నల్లగొండ, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల రైతులు మోసపోగా.. బాధితుల లెక్క తేలాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో లేకపోవడంతో...

కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన కళ్లెం అంజిరెడ్డిని అదే గ్రామానికి చెందిన, ముఠాలో ఒకరైన కొత్తా జీవన్‌రెడ్డి సంప్రదించాడు. మూడెకరాల భూమికి తనకు తెలిసిన వారి ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పిస్తానంటూ రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంజిరెడ్డి విడతల వారీగా రూ.5లక్షలు చెల్లించినా పాసుపుస్తకం ఇవ్వకపోగా మిగిలిన డబ్బు కావాలని ఒత్తిడి చేస్తుండడంతో అనుమానించాడు. ఆపై వాట్సప్‌లో ఓ పాస్‌పుస్తకం పంపించాడు. ఆ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే లేకపోవడంతో అనుమానం బలపడగా అంజిరెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్రంగా పరిగణించిన ఆయన సమగ్ర విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. దీంతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యాన సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు రంగంలోకి దిగారు. ఈక్రమాన రెండు కార్లలో బుధవారం ఉదయం జీవన్‌రెడ్డితో పాటు మహబూబాబాద్ జిల్లా గార్ల బయ్యారానికి చెందిన కొండూరి కార్తీక్ (ప్రస్తుతం ఖమ్మంలో నివాసం), భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన పారిపత్తి సాయికుశల్, లక్ష్మీదేవిపల్లికి చెందిన జక్కపల్లి వరప్రసాద్, ఖమ్మం బొక్కలగడ్డకు చెందిన నందమూరి లక్ష్మణ్‌రావు(ప్రస్తుతం సారపాకలో నివాసం) వెళ్తుండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో నకిలీ పాస్‌పుస్తకాలు తయారు చేస్తున్నట్లు ఒప్పుకోగా 10 పాస్ పుస్తకాలను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన లక్ష్మణ్ తన ప్రింటింగ్ ప్రెస్‌లోనే పాస్‌పుస్తకాలు తయారుచేసినట్లు అంగీకరించారని కూసుమంచి ఎస్సై నాగరాజు తెలిపారు. ఈ ముఠా చేతిలో ఎందరు రైతులు మోసపోయారో తేల్చేందుకు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రైతుల సమస్యలే ఆసరాగా..

వివాదాస్పద భూములతో పాటు వివిధ కారణాలతో పట్టాదారు పాస్ పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులను గుర్తించి ఈ ముఠా సంప్రదించడం మొదలుపెట్టింది. వీరికి పాసు పుస్తకాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షల చొప్పున మొత్తం రూ.కోట్లలో వసూలు చేశారు. భూముల ధర రూ.లక్షల్లో ఉండడంతో రైతులు కూడా ముఠా అడిగినంత డబ్బు ముట్టజెప్పారు. కూసుమంచి మండలంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ముఠా సభ్యులు ఎవరికి వారు తమకు పరిచయం ఉన్న రైతుల నుంచి డబ్బు లాగేశారు. డబ్బు తీసుకుని ముఖం చాటేయడంతో రైతుల నుంచి ఒత్తిడి ఎదురైంది. దీంతో నకిలీ పుస్తకాల తయారీకి శ్రీకారం చుట్టారు. ప్రింటింగ్ ప్రెస్‌లో పుస్తకాలు తయారుచేసి, కలర్ ప్రింటర్ సాయంతో రైతుల ఫొటోలు, పేర్లు ముద్రించడమే కాక ప్రభుత్వ హాలోగ్రామ్ వేసి రైతులకు అప్పగించారు.

విలీన గ్రామాలలో మౌలిక వసతులు



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మేయర్ నీరజ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 6వ డివిజన్‌లో రూ.1.46 కోట్ల నిధులతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ విలీనమైన గ్రామాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంపై దృష్టి సారించామని తెలిపారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడమేకాక ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్మన్ ఎర్రగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకోబు, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులుతో పాటు ఏలూరు శ్రీనివాసరావు, గొడ్డేటి మాధవరావు, ఎల్లంపల్లి హన్మంతరావు, సరళ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఐజీ విపుల్‌కుమార్

చర్ల: భద్రాద్రి జిల్లా చర్లలో సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్ ఏర్పాటుకు సీఆర్‌పీఎఫ్ ఐజీ విపుల్‌కుమార్ మంగళవారం స్థల పరిశీలన చేశారు. చర్లలోని సర్వే నంబర్ 117లో బెటాలియన్ కోసం పదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈ స్థలం వివరాలను తహసీల్దార్ శ్రీనివాస్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ బెటాలియన్ ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉన్నందున త్వరలోనే ఖరారు చేసి పనులు మొదలుపెడతామని తెలిపారు. ఆపై భద్రతా పరమైన అంశాలపై భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, స్థానిక పోలీసు అధికారులతో ఆయన చర్చించారు.

పకడ్బందీగా సదరమ్ శిబిరాలు

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్



క్యాంపును పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓ

ఖమ్మంవైద్యవిభాగం: యూడీఐడీ కార్డు(సదరమ్)ల జారీ కోసం నిర్వహిస్తున్న శిబిరాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ తెలిపారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కాగా, అన్ని పరీక్షల అనంతరం అర్హులకు సర్టిఫికెట్లు జారీ చేయనున్నందున ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొందరు అర్హత లేకపోయినా సర్టిఫికెట్ ఇప్పిస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారి సమాచారం తమకు ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 2వేల మంది వరకు స్లాట్ బుక్ చేసుకున్నందున షెడ్యూల్ ప్రకారం విడతల వారీగా క్యాంపులు నిర్వహిస్తామని సూపరింటెండెంట్ చెప్పారు. కాగా, సదరమ్ విభాగంలో కొందరు ఉద్యోగులపై ఆరోపణలు రావడంతో వారి స్థానంలో ఇతరులను నియమించామని, కార్యాలయాన్ని కూడా క్యాంపు నిర్వహించే ప్రాంతానికి మార్చినట్లు తెలిపారు.

సదరమ్ విభాగంలో విచారణ

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని సదరమ్ విభాగంలో జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత మంగళవారం విచారణ చేపట్టారు. ఈ విభాగంలోని ఓ ఉద్యోగి నకిలీ దివ్యాంగుల సర్టిఫికెట్‌తో డీఈఓగా విధులు నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విజేత విచారణ చేపట్టి ఉద్యోగుల వివరాలు సేకరించారు.

లంక భూముల సర్వే వాయిదా

మున్నేటి వరద పెరగడంతో వెనుదిరిగిన అధికారులు



మున్నేటి వద్ద వివిధ శాఖల ఉద్యోగులు

చింతకాని: చింతకాని మండలం చిన్నమండవ మున్నేటిలో ఉన్న ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూ పరిధి లంక భూముల సర్వే మరోమారు వాయిదా పడింది. సుమారు 67ఎకరాలకు పైగా లంక భూములకు కొందరు పట్టా చేయించుకుని రైతు భరోసా నిధులు పొందుతుండమే కాక ఇసుక తరలిస్తున్న వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్న విషయం ఇటీవల వెలుగు చూసింది. ఈ విషయమై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కాగా.. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యాన సర్వే చేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. తొలుత సోమవారం సర్వే చేయాలని భావించినా డిప్యూటీ సీఎం భట్టి పర్యటన ఉండడంతో వాయిదా పడింది. ఇక మంగళవారం మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మున్నేటి వద్దకు చేరుకోగా అప్పటికే వరద పెరిగి లంక భూముల్లోకి వెళ్లడం సాధ్యం కాక వెనుదిరిగారు. అయితే, గంగాపురం రెవెన్యూ పరిధి 123 నుంచి 126వ సర్వే నంబర్లలో లంక భూములకు పొందిన పట్టాదారు పాసుపుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించినట్లు సమాచారం. సర్వే కోసంవచ్చిన వారిలో డీఐ ధర్మారావు, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సర్వేయర్లు శాంతాకుమారి, ఉమామహేష్, నవీన్, ఇరిగేషన్ ఏఈ మహేష్, ఆర్‌ఐలు ఏకవీర, ప్రసన్న, గ్రామ రెవెన్యూ అధికారి ఉప్పలి తదితరులు ఉన్నారు.

ప్రకృతి పూజ.. గొప్ప సంస్కృతి

బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ అనుదీప్




బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ అనుదీప్ దంపతులు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు (ఇన్‌సెట్) పూజ చేస్తున్న కలెక్టర్ సతీమణి

ఖమ్మం వైద్యవిభాగం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే పండుగ బతుకమ్మ అని.. ప్రకృతిని పూజించడం ఈ పండుగలో గొప్పతనమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బతుకమ్మ వేడుకలను మూడో రోజైన మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొనగా.. ఆయన సతీమణితో కలిసి పూజలు చేశారు. డీఎంహెచ్ఓ కళావతిబాయి, కలెక్టరేట్‌లోని అన్ని శాఖల మహిళా ఉద్యోగులు, మహిళా ప్రాంగణం విద్యార్థినులు ఉత్సాహంగా బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు.

సమగ్ర విద్య అందించడమే లక్ష్యం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సమగ్ర విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం విద్యాశాఖపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పనిచేయాలని తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్ అమలులో దిగువన ఉన్న పది కాంప్లెక్స్ సీఆర్‌పీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, విద్యా ప్రమాణాల పెంపునకు ఎఫ్ఎల్ఎన్ పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. దసరా సెలవుల తర్వాత ప్రతీ వారం డీఈఓ, ఇతర అధికారుల ఆధ్వర్యాన పాఠశాలలను తనిఖీ చేయాలని చెప్పారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ నెలలోగా ఆధార్ కార్డు, అపార్, కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయించేలా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా, సెలవుల్లోనే భవనాలకు అవసరమైన మరమ్మతులు చేయించి ప్రీ ప్రైమరీ విద్యాసంస్థలను ప్రారంభించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల సర్దుబాటు, 1 నుంచి 5వ తరగతి పిల్లలు ప్రతిరోజు గంట పాటు చదివించడం(రీడింగ్ అవర్)పై కలెక్టర్ సూచనలు చేశారు. ఈ సమావేశంలో కేఎంసీ అభిషేక్ అగస్త్య, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకష్ణ, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కిన్నెరసాని నాలుగు గేట్లు ఎత్తివేత



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండడంతో నీటిమట్టం మంగళవారం 405.70 అడుగులకు పెరిగింది. దీంతో నాలుగు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు.

అలుగు పోసిన పాలేరు !



గత రెండు రోజులుగా జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు వరద చేరుతోంది. దీంతో మంగళవారం అలుగు పారింది. రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 2వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండడంతో పాటు సాగర్ నుండి మరో 4,312 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. దీంతో రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 23 అడుగులు దాటగా అలుగు పారుతోంది.

– కూసుమంచి

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అడిషనల్ డీసీపీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రామానుజం

ఖమ్మంక్రైం: ఖమ్మం అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా బి.రామానుజం ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కలెక్టర్ అనుదీప్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పెద్దాస్పత్రిలో వైద్యులు, ఉద్యోగుల నిరసన



నిరసనలో పాల్గొన్న వైద్యులు, ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: చికిత్సలో లోపం ఉందంటూ మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై కొందరు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆస్పత్రి ఎదుట నిరసన తెలపగా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ మాట్లాడుతూ చికిత్స కోసం వచ్చే ప్రాణాలు కాపాడేందుకు శ్రమించే వైద్యులపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్, నర్సింగ్ అసోసియేషన్ల బాధ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ కార్యాచరణ ఖరారు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన పోటీల నిర్వహణకు కార్యాచరణ ఖరారైందనిపాఠశాలల క్రీడా కార్యదర్శి పూనాటి వెంకటేశ్వర్లు తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో మండల, జోన్, జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీలను అక్టోబర్ 10వ తేదీలోగా పూర్తిచేసి ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. ఆతర్వాత ఉమ్మడి జిల్లా స్థాయిపోటీలు నిర్వహించాక రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేయనుననట్లు వెల్లడించారు. కాగా, జిల్లాస్థాయిలో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ పోటీలు పోటీలు జరుగుతాయని తెలిపారు.

వీడియో కెమెరామెన్ నియామకానికి దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో కెమెరామెన్)గా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికపై పనిచేసేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. డిగ్రీ అర్హతతో పాటు ఏపీ / తెలంగాణ స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ద్వారా జారీ చేసిన సినీ ఫొటోగ్రఫీ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలతో ఈనెల 25వ తేదీలోగా డీపీఆర్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

69 పీఏసీఎస్‌ల పాలకవర్గాలు కొనసాగింపు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని 76 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లకు గాను 69 పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ జిల్లా సహకార అధికారి జి.గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కుర్నవల్లి పాలకవర్గాన్ని గతంలోనే రద్దు చేయగా, మిగతా ఆరు సంఘాల పాలకవర్గాలను తాజాగా రద్దు చేసి ఆ స్థానంలో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. దశల వారీగా జరిగిన ఈ ప్రక్రియ మంగళవారంతో పూర్తయిందని అధికారులు వెల్లడించారు. అయితే, రద్దయిన ఏదులాపురం, నేలకొండపల్లి, చేగొమ్మ, తల్లాడ, కల్లూరు, పోచారం సంఘాల బాధ్యులు హైకోర్టును ఆశ్రయించారు. వీరికి అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చిందనే ప్రచారం జరుగుతున్నా జిల్లా సహకార శాఖ అధికారులు మాత్రం మంగళవారం వరకు ఉత్తర్వులు అందలేదని సమాచారం.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	3,000
కందులు	5,600	5,600
ఏసీ మిర్చి	14,600	8,000
మిర్చి	8,100	4,800
కొత్త పత్తి	7,300	4,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.19,107

ఆగలేదు.. ఆపారంతే!

- ఏపీ నుంచి మళ్లీ మొదలైన ఇసుక దందా
- సత్తుపల్లి మీదుగా హైదరాబాద్‌కు రవాణా
- ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టని యంత్రాంగం



దమ్మపేట మండలం నాగుపల్లిలో పట్టుబడిన ఇసుక లారీలు

సత్తుపల్లి: 'ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి.. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి కట్టడి చేయాలి.. మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటల పాటు సిబ్బంది పహారా కాయాలి..' అంటూ ఇటీవల పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఈ ఆదేశాలపై జిల్లా అధికారులకు ఏ మేర శ్రద్ధ పెట్టారో, లేదో తెలియదు కానీ ఏపీలో మాత్రం అక్కడి అధికారులు ఇసుక లారీలను సీజ్ చేశారు. దీంతో కొద్దిరోజుల పాటు ఆ రాష్ట్రం నుంచి ఇసుక రవాణా నిలిచిపోగా... మళ్లీ అంతా సద్దుమణగగానే తాజాగా మొదలైంది. రెండు రోజుల క్రితం ఇసుక లారీలను ఏపీ పోలీసులు మైనింగ్ శాఖకు అప్పగించి చేతులు దులుపుకోవడంతో అక్రమార్కులు మళ్లీ రవాణా మొదలుపెట్టగా సత్తుపల్లి రహదారులపై టిప్పర్లు, లారీలు రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి.

సరిహద్దు దాగుడుమూతలు

ఏపీ నుంచి సోమవారం అర్ధరాత్రి రెండు లారీల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సత్తుపల్లి పోలీసులు బుగ్గపాడు మీదుగా నాగుపల్లి వరకు వెళ్లారు. అక్కడ రెండు లారీలు కనిపించగా సీజ్ చేసేందుకు యత్నిస్తుండగా ఆ ప్రాంతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి పరిధిలోకి వస్తుందని తేలింది. దీంతో దమ్మపేట పోలీసులను పిలిచి అప్పగించారు. కాగా, అక్కడ చాలాసేపు హైడ్రామా నడిచినట్లు సమాచారం.

అటు వెళ్లగానే...

ఓ వైపు సత్తుపల్లి పోలీసులు ఇసుక లారీలను పట్టుకునేందుకు పక్క మండలానికి వెళ్లగా.. అదే సమయంలో ఏపీ నుంచి ఇసుకతో వచ్చిన ఐదారు లారీలు వెళ్లినట్లు సమాచారం. అయితే, పోలీసులను కొందరు పక్కదోవ పట్టించేందుకు ఈ తరహా ప్రయత్నం చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఇక ఏపీ నుంచి సత్తుపల్లి మీదుగా హైదరాబాద్‌కు నిత్యం పదుల సంఖ్యలో ఇసుక లారీలు ఎటువంటి ఆటంకాలు లేకుండా వెళ్తుండడం జిల్లాలో తనిఖీల పరిస్థితిని తెలియచేస్తోంది.

నష్టం లేకుండానే..

కాగా, ఇసుక లారీలను పట్టుకున్నప్పుడు మైనింగ్ శాఖకు అప్పగిస్తే లారీ యజమానులు ఊరటగానే భావిస్తారని సమాచారం. మైనింగ్‌శాఖ మొదటి సారి పట్టుకున్నప్పుడు టన్నుకు రూ.1,200 చొప్పున జరిమానా విధించి అది చెల్లిస్తే ఇసుక సహా లారీలు ఇచ్చేస్తారు. దీంతో ఆ ఇసుకను మంచి ధర ఉన్న చోటకు తీసుకెళ్లి అమ్మితే యజమానులకు ఎలాంటి నష్టముండదు. సత్తుపల్లిలో టన్ను ఇసుక ధర రూ.1,100 ఉంటే ఖమ్మంలో రూ.1,500గా, హైదరాబాద్‌లో రూ.3వేల వరకు వస్తుండడంతో లారీని పట్టుకోగానే మైనింగ్‌శాఖకు అప్పగించాలని లారీ యజమానులే కోరుతుంటారట! రెండో సారి కూడా అదే స్థాయిలో జరిమానా విధించనుండగా.. మూడో సారి పట్టుబడితే మాత్రం జరిమానా రెండింతలు చేసి అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తారు.

టన్నుల మాయాజాలం

ఇసుక అక్రమ రవాణా చేసే లారీల బాధ్యులు కాంటా రెండు విధాలుగా చూపిస్తున్నారని సమాచారం. ఒక్కో లారీకి 20 టన్నులు, పెద్ద లారీలైతే 30 టన్నులు వే బ్రిడ్జి బిల్లుతో తీసుకెళ్తుంటే పట్టుబడినప్పుడు అంత మొత్తానికే జరిమానా విధిస్తారు. వాస్తవానికి ఒక్కో 20 టన్నుల లారీలో 40 టన్నులు, 30 టన్నుల లారీల్లో 60 – 70 టన్నుల ఇసుక రవాణాకు అవకాశముంటుందని చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఇసుక రీచ్‌ల రశీదు, వే బ్రిడ్జి బిల్లునే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో యజమానులు పెద్దగా నష్టం లేకుండానే బయటు పడుతున్నారని సమాచారం. కాగా, సోమవారం రాత్రి దమ్మపేటలో రెండు లారీలు పట్టుబడగా ఒక్కో లారీలో 20 టన్నుల ఇసుక ఉన్నట్లు కేసు నమోదు చేశారు.

మధిర విద్యుత్ డివిజన్‌కు ఉద్యోగులు

కేడర్ల వారీగా కేటాయింపుపై కసరత్తు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో నూతనంగా ఏర్పాటైన మధిర విద్యుత్ డివిజన్‌కు ఉద్యోగుల కేటాయింపు అంశంపై శాఖ ఉన్నతాధికారులతో ఏర్పాటైన కమిటీ మంగళవారం కసరత్తు చేసింది. ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీ కోఆర్డినేటర్, ఎన్పీడీసీఎల్ ఆడిట్ విభాగం జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈ బాబూరావు, వివిధ డివిజన్ల ఇంజనీర్లు పాల్గొన్నారు. జిల్లాలో నాలుగు విద్యుత్ డివిజన్లు ఉండగా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటుచేసే క్రమాన మధిర తెరపైకి వచ్చింది. ఈ డివిజన్‌కు ఉద్యోగుల కేటాయింపుపై చర్చించిన కమిటీ ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు తదితర కేడర్లు మొదలు చిరుద్యోగుల వరకు డివిజన్ స్థాయిలో బదిలీ చేయనున్నారు. ఆపై కేడర్ల ఉద్యోగుల బదిలీలను కార్పొరేట్ కార్యాలయం నుంచి నిర్వహిస్తారు. ఈ మేరకు సమావేశంలో చర్చించిన అంశాలపై సీఎండీకి సమర్పించేలా నివేదిక రూపొందించారు.

విద్యుత్ సంఘాల వినతి

కొత్తగా ఏర్పాటైన మధిర డివిజన్‌కు ఉద్యోగుల కేటాయింపు అంశంలో నిబంధనలు పాటిస్తూ, సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవాలని విద్యుత్ కార్మిక సంఘాల బాధ్యులు కోరారు. పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు టీజీయూఈఈయూ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ప్రసాద్, 1104 జిల్లా కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు, అదనపు కార్యదర్శి సరేష్, కిరీట చారి, వెంకటేశ్వర్లు తదితరుల ఆధ్వర్యాన వినతిపత్రాలు అందజేశారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



మనోజ్‌కుమార్, ప్రసాద్ (ఫైల్)

నేలకొండపల్లి: ఎక్కడకు వెళ్లినా కలిసిమెలిసి తిరిగే ఇద్దరు స్నేహితులకు మృత్యువు కూడా విడదీయలేకపోయింది. చీకటి, వర్షం కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా.. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రగాయాలతో మృత్యువాత పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంకు చెందిన డిగ్రీ విద్యార్థి బచ్చలకూరి మనోజ్‌కుమార్(18), మెకానిక్ సన్నీ ప్రసాద్(17) ఇద్దరు స్నేహితులు. వీరు మంగళవారం రాత్రి బైక్‌పై నేలకొండపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఇటుక బట్టీల సమీపాన ఎదురుగా మరో బైక్ వస్తుండడంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మనోజ్, ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే ససరికి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, జోరు వాన, చీకటిగా ఉండడంతో ఎదురుగా బైక్‌పై వస్తున్న వారికి కనిపించక ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, మృతులిద్దరూ ఒకే గ్రామస్తులు, స్నేహితులు కావడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా రత్నాకర్



రత్నాకర్‌రావు

ఖమ్మం లీగల్: ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీగా) సీనియర్ న్యాయవా ది కండెపనేని రత్నాకర్‌రావు నియమితులయ్యా రు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాదిగా 1994లో నమోదైన రత్నాకర్ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నాడు. తన నియామకానికి సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలపగా, కాంగ్రెస్ లీగల్ సెల్ బాధ్యులతో పాటు న్యాయవాదులు పలువురు ఆయనను అభినందించారు.

రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు తాటిగూడెం బాలిక

అండర్ – 15 ప్రాబబుల్ టీమ్‌కు ఎంపిక



దేవీప్రియ

కరకగూడెం: అండర్ – 15 రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ జట్టుకు కరకగూడెం మండలంలోని తాటిగూడెంకు చెందిన రామటెంకి దేవీప్రియ ఎంపికైంది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి అండర్ –15 మహిళా క్రికెట్ ప్రాబబుల్ జట్టులో స్థానం దక్కించుకుంది. ఆమె తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడైన హనుమంతరావు దేవీప్రియకు క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించి శిక్షణ ఇప్పించారు. ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించిన ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్‌లో 600 మంది క్రీడాకారిణుల మధ్య ప్రతిభ చాటిన దేవీప్రియ ప్రాబబుల్ జట్టులో చోటు దక్కించుకోగా హెడ్ కోచ్ సురేందర్‌రెడ్డి, కోచ్‌లు వెంకట్ యాదవ్, బుచ్చిబాబు, ఇర్ఫాన్ అభినందించారు.

ఆకేరులో పడి రైతు గల్లంతు..

మృతదేహాన్ని వెలికితీసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



రాములు (ఫైల్)

తిరుమలాయపాలెం: పొలం పనులకు వెళ్లి వస్తూ ఆకేరు నది దాటే క్రమాన రైతు వరదలో గల్లంతు కాగా.. ఆయన మృతదేహానిన ఎన్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెలికితీశారు. మండలంలోని పడమటి తండాకు చెందిన రైతు గుగులోతు రాములు(58) ఆకేరు పక్కన మరిపెడ మండల పరిధిలోని బలరాంతండాలో భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఆయన ఆకేరు చెక్‌డ్యాం మీదుగా ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు ఆకేరులో పడిపోయాడు. ఈ విషయం తెలిసి గ్రామస్తులు గాలించినా ఫలితం కానరాలేదు. ఈమేరకు మంగళవారం పోలీసులు, ఎస్డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది సుమారు ఐదుగంటల పాటు గాలించగా బ్రిడ్జి కూలిన శిథిలాల కింద రాములు మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. ఆయనకు భార్య బోడి, ఓ కుమారుడు ఉన్నారు.

సాగర్ కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన ఎన్నెస్పీకాల్వలో గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. మృతదేహం ఉందనే విషయమై స్థానికులు జీపీఓ ద్వారా ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ సూరజ్ ఆధ్వర్యాన బయటకు తీయించారు. మృతుడు నలుపు రంగు నెక్ టీ షర్టు, లోదుస్తులు ధరించి ఉండగా, అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59150 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి



పంతులు (ఫైల్)

కారేపల్లి: పురుగు మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని మంగళి తండా గ్రామానికి చెందిన ధరావత్ పంతులు (52) నాలుగెకరాల్లో పత్తి, వరి సాగు చేస్తుండగా, ఇటీవల ఆయన భార్య హసాలి అనారోగ్యానికి గురవడంతో చికిత్స చేయించాడు. ఈక్రమాన అప్పులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకాగా ఈనెల 22వ తేదీన పురుగుల మందు తాగాడు. ఆయనను కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పంతులుకు భార్యతో పాటు ఓ కుమారుడు ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్‌పై ఆరా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్‌ను వరంగల్ ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్ మంగళవారం పరిశీలించారు. యార్డ్‌లో బయో మైనింగ్ ప్రక్రియ వివరాలపై ఆరాతీసిన ఇప్పటివరకు ఎంత మొత్తం లో వ్యర్థాలను శుభ్రం చేశారు, ఎంత స్థలం అందుబాటులోకి వచ్చిందనే వివరాలు తెలు సుకున్నారు. అలాగే, మిగతా వ్యర్థాలను గడువులోగా శుభ్రం చేయాలని ఏజెన్సీ బాధ్యులకు సూచించారు. తొలుత ఆర్‌డీఎంఏ మసూద్‌ను కేఎంసీ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, ఏఎంసీ అనిల్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్ కలిశారు.

జీఎస్టీ పేరిట ప్రజలపై భారం

సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా: నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచి ఇప్పటివరకు వరకు జీఎస్టీ పేర ప్రజలపై భారం మోపుతూ లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఈ కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో ప్రజలను దృష్టి మరల్చేందుకు స్వదేశీ మంత్రం జపిస్తున్నారని తెలిపారు. వైరాలోని సీపీఎం కార్యాలయంలో దొంతబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పరిస్థితుల దృష్ట్యా తక్షణమే పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుక రావాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రప్రభుత్వం హామీల అమలులో కాలయాపన చేయొద్దని సూచించారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొండెబోయిన నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, కుటుంబరావు, ఉమాపతి, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆది సేవా కేంద్రాలు ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న డీడీ, ఉద్యోగులు

కారేపల్లి: ఆదికర్మ యోగి అభియాన్ పథకంలో భాగంగా మండలంలోని మాధారం, ఉసిరికాయలపల్లి, పేరుపల్లి, రేలకాయలపల్లి, కోమట్లగూడెం, గేటుకారేపల్లి, బాజుమల్లాయిగూడెం, మాణిక్యారంల్లో ఆది సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎస్.విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించగా, పథకంపై అవగాహన కల్పించేలా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీడీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేలా ఈ పథకాన్ని అమలుచేస్తున్నారని తెలిపారు. గ్రామపంచాయితీల వారీగా సమస్యలపై దరఖాస్తుల ద్వారాను కేంద్రాల్లో సేకరిస్తామని, ఆపై అక్టోబర్ 7వ తేదీన గ్రామసభల్లో చర్చించాక ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తామని వివరించారు. ఏసీఎంఓ ఎల్.రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాలతి, గ్రామకార్యదర్శులు నిరంజన్, విజయ్, సురేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తికి నిలువుటద్దం స్వామి రమేష్



స్వామి రమేష్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు 24 పతకాలు సాధించడంలో కీలకంగా నిలిచిన స్వామి రమేష్ క్రీడా స్ఫూర్తికి నిలువుటద్దంలా నిలిచారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కొనియాడారు. భారత బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఖమ్మంకు చెందిన న్యాయవాది స్వామి రమేష్‌ను మంగళవారం సాయంత్రం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘురాంరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ అభివృద్ధికి రమేష్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే దేశ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మల్లాది వాసుదేవరావు, వడ్డెల్లి కృష్ణమూర్తి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులతో పాటు క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పనులు పరిశీలన



దాతకు రశీదు అందిస్తున్న ఈఓ

భద్రాచలం: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకం ద్వారా భద్రాచలంలో జరుగుతున్న పనులను శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓ కొల్లు దామోదర్‌రావు మంగళవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. కాగా, దేవస్థానం ఆధ్వర్యాన నిర్వహించే గోశాల అభివృద్ధికి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన అల్లు వెంకట ఫణికిరణ్ రూ.1,01,116 విరాళాన్ని ఈఓకు అందజేశారు.

వైఎస్సార్ నగర్‌లో దొంగల హల్‌చల్

ఎనిమిది మంది ముఠా.. ఆరు ఇళ్లలో చోరీ



చోరీ చేస్తున్న నిందితులు (సీసీ టీవీ ఫుటేజీ)

ఖమ్మం అర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ముసుగులు ధరించి వచ్చిన ఎనిమిది మంది ముఠా కాలనీలోని ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు వసంతబాయి, రుక్మిణి లేకపోవడంతో వారి ఇళ్ల తాళాలు పగలగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లినట్టు సమాచారం. దొంగల కదలికలు సీసీ కెమెరాల్లో కూడా రికార్డు అయ్యాయి. అంతేకాక ఒక బెల్ట్ షాప్‌లో జొరబడి నగదు చోరీ చేయడంతో పాటు మద్యం తాగినట్లు సమాచారం. ఈక్రమాన ఒక మహిళ అడ్డుకునే ప్రయత్నం చేస్తే సెల్‌ఫోన్ లాక్కుని, మరో ఇద్దరిపై దాడి చేసినట్లు తెలిసింది. ఈ విషయమై అందిన సమాచారంతో మంగళవారం ఉదయం ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. అయితే, చోరీల వెనుక స్థానిక యువకులే ఉన్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే మాదిరి గత నెలలోనూ మధురనగర్ ప్రాంతంలో ముసుగులు ధరించిన వ్యక్తులు చోరీ చేశారు. ఈమేరకు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టేకులపల్లి వంతెన వద్ద రక్షణ గోడ

ప్రధాన రోడ్డులో ప్రమాదాల నివారణకు ప్రతిపాదన



రక్షణ గోడ నిర్మించనున్న ప్రాంతం ఇదే..

ఖమ్మం అర్బన్: జిల్లా కేంద్రంలో సాగర్ ప్రధాన కాల్వపై టేకులపల్లి వద్ద వంతెన ఉండగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రమాదాల నివారణకు అక్కడ రక్షణ గోడ నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. ఖమ్మం–వైరా బైపాస్‌లో కాల్వకు ఆనుకుని ప్రధాన రహదారి ఉండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అలాగే, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు సమీపాన కాల్వలోకి కారు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. జిల్లాలోని ఇలాంటి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా.. టేకులపల్లి వంతెన వద్ద ప్రమాదాలను అరికట్టేందుకు రక్షణ గోడ నిర్మించాలని నిర్ణయించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో జల వనరుల శాఖ అధికారులు సుమారు 500 మీటర్ల పొడవైన రక్షణ గోడ నిర్మాణంతో పాటు లక్ష్మీనగర్ వాసుల కోసం బతుకమ్మ ఘాట్ పేరిట మెట్లు కూడా నిర్మించనున్నారు. ఇందుకోసం సుమారు రూ.5 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

23.6కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: ఖమ్మం నూతన బస్టాండ్‌లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 23.6కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన కార రజన, మధ్యప్రదేశ్‌కు చెందిన త్రినాథ్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద బ్యాగ్‌ల్లో పరిశీలించగా గంజాయి లభించిందని ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శ్రీహరిరావు, హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, విజయ్, హన్మంతరావు, వీరబాబు, స్వరూప, బేబి, ఉపేందర్ పాల్గొన్నారు.

బాప్‌రే.. మొక్కజొన్న!



సహజంగా మొక్కజొన్న మొక్కలు మూడు అడుగులు.. అంతకు కాస్త ఎక్కువ ఎత్తు పెరుగుతాయి. కానీ నేలకొండపల్లిలో స్వాతంత్ర సమరయోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య నివాసంలో మొక్కజొన్న చెట్టు దాదాపు 20 అడుగుల మేర పెరిగింది. వెంకయ్య భార్య, మాజీ ఎంపీటీసీ వున్నం స్వరాజ్యం మొక్కజొన్న పిలక నాటి అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సంరక్షించడంతో ఏపుగా పెరిగిందని తెలిపారు.

– నేలకొండపల్లి